క్లుప్తంగా

బీజేపీ జిల్లా కార్యదర్శిగా సాయినాథ్


సాయినాథ్

భైంసాటౌన్: బీజేపీ జిల్లా కార్యదర్శిగా పట్టణానికి చెందిన తాడేవార్ సాయినాథ్ నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ ప్రకటించినట్లు సాయినాథ్ తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించినట్లు జిల్లా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

వాహనాల తనిఖీ


తనిఖీ చేస్తున్న ఎస్సై షేక్ జుబేర్

తానూరు: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై షేక్ జుబేర్ పేర్కొన్నారు. మండలంలోని హిప్నెల్లి సమీపంలో ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి ధ్రువపత్రాలను పరిశీలించారు. వాహనదారులు తమవెంట ధ్రువపత్రాలు తెచ్చుకోవాలన్నారు. బైక్ నడుపుతూ మైనర్లు తనిఖీలో పట్టుబడితే పోషకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

పిచ్చికుక్క దాడిలో బాలుడికి గాయాలు


గాయపడిన అబ్దుల్లాతో తండ్రి హైమద్

బాసర: బాసరలో పిచ్చికుక్క దాడిలో బాలుడికి గాయాలయ్యాయి. అల్లి అబ్దుల్లా అనే బాలుడు ఆదివారం నడుచుకుంటూ వెళ్తుండగా కుక్క దాడి చేసింది. స్థానికులు గమనించి అతన్ని పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. కాలనీల్లో కుక్కల బెడద నివారించాలని అధికారులకు పలుమార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చికెన్, మటన్ షాపుల వద్ద ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని చిన్నారులు వృద్ధులు వెళ్తున్నారని తెలిపారు. అధికారులు పిచ్చికుక్కలను నివారించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లాటరీలో వరించిన మేక


మేకతో నవీన్

లక్ష్మణచాంద: లక్కీ లాటరీలో ఓ వ్యక్తికి మేక వరించింది. మండలంలోని పొట్టపెల్లి గ్రామానికి చెందిన వొద్ది రాకేశ్ దసరా పండుగ సందర్భంగా రూ.178లకు 10 కేజీల మేక అని ప్రకటించారు. చాలా మంది లాటరీలో పాల్గొన్నారు. ఆదివారం లాటరీ తీయగా ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామానికి చెందిన నవీన్‌కు రూ.8 వేల మేకను అందించారు.

కన్కపూర్‌లో గాజుల పండుగ

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్‌లో ఆదివారం గాజుల పండుగ నిర్వహించారు. గాజులు వేసుకుంటే బాగుంటారన్న సంప్రదాయంతో మహిళ స్నేహితులు గాజుల వేసుకున్నారు. వారంతా గోరింటాకు పెట్టుకుని కొత్త గాజులు ఒకరికొకరు వేసుకుని మిఠాయిలు పంచుకున్నారు.

పరామర్శ

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామానికి చెందిన ఆకుల నర్సయ్య తండ్రి రాజన్న, పల్లెర్ల రమేశ్ తల్లి ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పెంబి: మండంలోని లోతర్యతండా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త పరిటాల రవి, మందపల్లికి చెందిన నర్సపెల్లి భూమరాజు ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ ఆదివారం పరామర్శించారు. శస్త్రచికిత్స తర్వాత ఇంట్లో ఉన్న ఇటిక్యాల్‌కు చెందిన అయిండ్ల గంగవ్వ, చేతికి గాయమైన మందపల్లికి చెందిన ముడుగుల సునీల్‌ను పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, నాయకులు గంగారెడ్డి, విలాస్, శంకర్, చిన్నయ్య ఉన్నారు.

పరీవాహకంపై పట్టింపేది?

- వరదలకు ఎస్సారెస్పీ గేట్ల ఎత్తివేత
- దిగువకు నీటి విడుదల
- ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి
- ప్రజలు, కాపర్లను అప్రమత్తం చేయడంలో నిర్లక్ష్యం
- పట్టని అధికారులు


ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

ఖానాపూర్: ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు జిల్లాలో గోదావరి నది రెండు నెలలుగా ఉధృతంగా ప్రవహిస్తోంది. మహారాష్ట్రలో కురిసిన భారీ వరదల కారణంగా ఇటీవల ఎస్సారెస్పీ గేట్లు ఎత్తడంతో గోదావరిలోకి నీరు చేరుతోంది. ప్రస్తుతం అధికారులు ప్రాజెక్టు గేట్లు ఎత్తి లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఖానాపూర్, కడెం, దస్తురాబాద్ మండలాల్లో గోదావరి పరీవాహక ప్రాంతాలైన సదర్‌మాట్, మేడంపల్లి, సుర్జాపూర్, బాదన్‌కుర్తి, మస్కాపూర్, ఖానాపూర్, దిలావర్‌పూర్, గోడలపంపు, బావాపూర్(కె)తోపాటు తదితర గ్రామాల ప్రజలు, పశువుల కాపర్లు, జాలర్లను అప్రమత్తం చేయాలి. కానీ సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ముందస్తు సమాచారం తెలిసిన గ్రామాల్లో దండోరా వేయకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

ఇవి ఘటనలు..

- 15 ఏళ్ల క్రితం సదర్‌మాట్ ప్రాంతంలో చేపల వేటకు వెళ్లిన ముగ్గురు గోదావరి ప్రవాహంలో చిక్కుకుపోయారు. అప్పటి ఉన్నతాధికారులు హెలికాప్టర్ సహాయంతో కాపాడారు.
- 10, 8 ఏళ్ల క్రితం ఖానాపూర్ మండలం బావాపూర్(కే)లో పశువుల కాపర్లు గోదావరి మధ్యలో కుర్రు (దివి) ప్రాంతంలో చిక్కుకున్నారు.
- మూడేళ్ల క్రితం మేడంపల్లి శివారులో కుర్రుపై జగిత్యాల జిల్లా రైతులు చిక్కుకున్నారు. అధికారులు తాళ్లసాయంతో కాపాడారు.
- ఆగస్టు 27న లక్ష్మణచాంద మండలం పార్‌పెల్లి తండాకు చెందిన గుగ్లావత్ శంకర్, శ్రీనివాస్, లింగన్న గోదావరి మధ్యలోని కుర్రు(దీవి)పై పశువులను మేపేందుకు వెళ్లారు. అదే రోజు ఎస్సారెస్పీ గేట్లు ఎత్తడంతో నీటి ప్రవాహం పెరిగింది. శ్రీనివాస్, లింగన్న తెప్పల సాయంతో ఒడ్డుకు చేరగా శంకర్ చిక్కుకుపోయాడు. కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీషర్మిల చొరవతో ఎన్డీఆర్ఎఫ్ బృందం 36 గంటలు శ్రమించి అతన్ని ఒడ్డుకు తీసుకువచ్చారు.
- గతనెల 31న కడెం మండలం చిట్యాల సమీపంలో గోదావరి మధ్యలో దీవిపై చిన్నబెల్లాల్‌కు చెందిన రైతులు మొగిలి, గంగులు పశువులను మేత కోసం తోలుకెళ్లి అక్కడే చిక్కుకున్నారు. వరద తగ్గుముఖం పట్టాకే వచ్చారు.

వరద తగ్గేవరకు వెళ్లొద్దు

ఇటీవల ఎస్సారెస్పీ గేట్లు ఎత్తడంతో గోదావరిలో భారీగా వరద చేరుతోంది. కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాలతో శాఖల అధికారులతో కలిసి గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశాం. గ్రామాల్లో చాటింపు చేశాం. వరద పూర్తిగా తగ్గుముఖం పట్టేవరకు ప్రజలు గోదావరి వైపు వెళ్లొద్దు.

– సుజాత, తహసీల్దార్, ఖానాపూర్

రోడ్డుకు మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..



తానూరు: మండలంలోని బెంబర గ్రామ సమీపంలోని బ్రిడ్జి వద్ద భారీ వర్షం, వరదలకు రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనాలు, పాఠశాలల బస్సుల రాకపోకలు నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రజలు, విద్యార్థులు పడుతున్న ఇక్కట్లపై గతనెల 26న ‘రోడ్లకు మరమ్మతులెప్పుడో’ శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ విషయాన్ని గ్రామస్తులు, కార్యకర్తలు ఎమ్మెల్యే రామారావుపటేల్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో అధికారులు శనివారం రోడ్డుకు మరమ్మతు చేపట్టారు.

ముధోల్ మున్నూరుకాపు కమిటీ రద్దు

భైంసాటౌన్: ముధోల్ నియోజకవర్గ మున్నూరుకాపు కమిటీ రద్దు అయిందని నియోజకవర్గ కుల పెద్దలు పలువురు తెలిపారు. పట్టణంలోని గణేష్‌నగర్ మున్నూరుకాపు సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇదివరకు ఉన్న కమిటీ పదవీ కాలం పూర్తయిందని, త్వరలోనే నూతన కమిటీకి ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అప్పటివరకు ఎవరూ నియోజకవర్గ కమిటీ బాధ్యులుగా చెలామణి కావద్దని స్పష్టం చేశారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మున్నూరుకాపు రాష్ట్ర కార్యవర్గసభ్యుడు హన్మాండ్లు, పట్టణ సంఘం అధ్యక్షుడు మల్లేశ్వర్, భట్టిగల్లి సంఘం అధ్యక్షుడు తూమోల్ల దత్తాత్రి, కులపెద్దలు జుట్టు అశోక్, మెంచు గంగయ్య, మురళీధర్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

ఖానాపూర్: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. వెంకట్రావు, రాజేష్ నాయక్, శ్యాం, లక్ష్మీనర్సయ్య, రాము, భీమలింగం, నెహ్రూ ఉన్నారు.

బతుకమ్మ సంబురాలు


పొన్కల్‌లో..


లక్ష్మణచాంద మండలంలో..


శ్రీరాంనగర్‌లోని సదర్మాట్ కాలువ వద్ద బతుకమ్మ నిమజ్జనం చేస్తున్న మహిళలు

మామడ/లక్ష్మణచాంద: మామడ మండలం పొన్కల్‌లో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో, లక్ష్మణచాంద మండలకేంద్రంతోపాటు పొట్టపెల్లి(కే), రాచాపూర్, వడ్యాల్ గ్రామాల్లో ఆదివారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి కూడళ్ల వద్ద ఉంచి మహిళలు ఆడిపాడారు. పొన్కల్ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి శోభాయాత్ర నిర్వహించారు. సంస్కృతిని ప్రతిబింబించేలా తయారు చేసిన బతుకమ్మలకు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు.

ఖానాపూర్: పట్టణంతోపాటు పలు గ్రామాల్లో శనివారం రాత్రి సద్దుల బతుకమ్మ ఉత్సవాలు జరిగాయి. మహిళలు బతుకమ్మ ఆటలు, కోలాటాలు ఆడిపాడారు. వీధుల గుండా బతుకమ్మలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం శివారు ప్రాంతంలోని గోదావరి, కాలువలు, కుంటలలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. పలు కూడళ్ల వద్ద మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేయగా, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పంచ పరివర్తన్‌తో ఐక్యతకు కృషి

- ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత సహ సంయోజక్ వేంపల్లి ప్రతాప్


భైంసాటౌన్: మాట్లాడుతున్న వేంపల్లి ప్రతాప్


దస్తురాబాద్: పాల్గొన్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

భైంసాటౌన్: పంచ పరివర్తన్ ద్వారా హిందువుల ఐక్యతకు ఆర్ఎస్ఎస్ కృషి చేస్తోందని గ్రామ వికాస్ తెలంగాణ ప్రాంత సహ సంయోజక్ వేంపల్లి ప్రతాప్ అన్నారు. ఆర్ఎస్ఎస్ వందేళ్ల స్థాపన ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పులేనగర్ శ్రీ సరస్వతి శిశుమందిర్ ఆవరణలో మహిషా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం విజయదశమి ఉత్సవం నిర్వహించారు. ప్రధాన వక్తగా ఆయన పాల్గొని మాట్లాడుతూ 1925లో ప్రారంభమైన ఆర్ఎస్ఎస్ నేడు దేశవ్యాప్తంగా విస్తృత శాఖలతో, విభిన్న రంగాల్లో దేశ భక్తిపూరిత, హిందుత్వ ఆధార సంస్థలతో ప్రపంచంలోని అనేక దేశాల్లో పనిచేస్తోందన్నారు. హిందువుల్లో ఐక్యతను శాఖ ఆధారంగా సంఘం పెంపొందిస్తుందన్నారు. దేశ అభివృద్ధికి హిందువులు పంచ పరివర్తన కోసం పాటు పడాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఇంటింటి జనజాగరణ చేపట్టబోతున్నామని తెలిపారు. నాంపల్లి శ్రీకాంత్, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుంటాల: దేశభక్తిని చాటాలని ఆర్ఎస్ఎస్ వక్తలు వంగల సుధాకర్, దిగాంబర్ పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని ఓల, పెంచకల్‌పాడ్ గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. అనంతరం ప్రధాన వీధుల్లో మతసంచలన్ నిర్వహించారు. సిందే సదాశివ్ పటేల్, పాపారావ్, జిల్లా గోసేవా ప్రముక్ కొత్తకాపు నారాయణ, స్వయం సేవకులు పాల్గొన్నారు.

కుభీర్: గోడ్సరలో జరిగిన ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవంలో ఖండ కుటుంబ ప్రబోదక్ బాలాజీ, ఖండ భౌద్ధిక్ ప్రముఖ్ శ్రీనివాస్, నాయకులు రాజు, రుత్విక్ పాల్గొన్నారు.

దస్తురాబాద్: మండల కేంద్రంలో ఆర్ఎస్ఎస్ వందేళ్ల స్థాపన ఉత్సవంలో భాగంగా మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం విజయదశమి ఉత్సవాన్ని నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ గ్రామ వికాస్ తెలంగాణ ప్రాంత సహ సంయోజక్ వేంపల్లి ప్రతాప్, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

మామడ: మండలంలోని కొరిటికల్‌లో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవం నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ ఖండ బౌద్ధిక్ ప్రముఖ్ కిష్టన్న, స్వయం సేవకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాసర: మండల కేంద్రంలోని శిశు మందిర్ ప్రాంగణం వద్ద నిర్వహించిన విజయదశమి ఉత్సవంలో ఆర్ఎస్ఎస్ సమన్వయ ముఖ్యకార్యకర్తలు వీహెచ్‌పీ కార్యదర్శి కృష్ణాజీ, నిర్మల్ జిల్లా కుటుంబ ప్రబోధ ప్రముఖ్ సంజయ్ పాండే పాల్గొన్నారు. ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.





కోతకు గురైన రోడ్డు

ముధోల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండల కేంద్రం నుంచి ధర్మాబాద్ వెళ్లే బీటీ రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. రాకపోకలు సాగించే వాహనదారులు ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. ఈ మార్గంలో రైతుల పొలాలు వందలాది ఎకరాలు ఉన్నాయి. చేతికందిన సోయా కోసుకురావడానికి అటు వెళ్లేందుకు కోత మిషన్లు, ట్రాక్టర్, ద్విచక్రవాహనదారులు వెళ్లలేని పరిస్థితి ఉంది. రోడ్డుకు మరమ్మతు చేపట్టేలా ఇప్పటికైన అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పీపీఎల్-4 విజేత రన్ రూలర్స్


విజేతగా నిలిచిన రన్ రూలర్స్ జట్టు

పెంబి: గత తొమ్మిది రోజులుగా కొనసాగుతున్న పెంబి ప్రీమియర్ లీగ్ (పీపీఎల్) సీజన్-4 ఆదివారంతో ముగిసింది. రన్ రూలర్స్ జట్టు విజేతగా, రన్నర్‌గా డైనమిక్ పంతర్ జట్టు నిలిచింది. బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్.. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విజేత జట్టుకు రూ.25 వేలు, షీల్డు, రన్నర్‌కు రూ.15 వేలు, షీల్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. మారుమూల పెంబి ప్రాంతంలో ఇంత పెద్ద టోర్నీ నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మండల అధ్యక్షులు స్వప్నీల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, వెంకటేశ్, మాజీ వైస్ ఎంపీపీ గంగారెడ్డి, నాయకులు విలాస్, శంకర్, గోవింద్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆలయ బ్రహ్మోత్సవాలు

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్‌లో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం పండితులు చక్రపాణి నర్సింహమూర్తి, కోటపెల్లి అనీష్, నితీశ్ ఆధ్వర్యంలో విష్ణు యాగం, బలిహరణం, సదస్యము, వేద గోష్టి, భేరి పూజ, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రామునాయక్, బక్కి కృష్ణ, కోశాధికారి గాజుల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఘనంగా తుల్జా భవానీ జాతర

నిర్మల్‌రూరల్: మండలంలోని రాణాపూర్‌లో తుల్జా భవానీ జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు జిల్లా నుంచేకాక మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులకు రాథోడ్ మహేందర్ మహారాజ్ ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. జాతర సందర్భంగా రూరల్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రైతులకు పరిహారం చెల్లించాలి


ముంపు భూముల బాధిత రైతులు, రిటైర్డు డీఎస్పీ మనోహర్

నవీపేట: గోదావరి నది ప్రాంత రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని న్యాయవాది, రిటైర్డు డీఎస్పీ మనోహర్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా నవీపేట మండల కేంద్రంలోని ఆర్ఆర్ గార్డెన్‌లో ఆదివారం నిజామాబాద్, నిర్మల్ ఉమ్మడి జిల్లాల ఎస్సారెస్పీ ముంపు ప్రాంత రైతుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి మనోహర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నందిపేట మండలంలోని ఉమ్మెడలో నిర్మించిన బ్రిడ్జి కింద ఏటవాలు కాకుండా కట్టల రూపంలో నిర్మాణం చేపట్టారని, దీంతో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద నీరు నదీతీరంలోని పంట పొలాలు, నివాసిత గ్రామాలకు చేరుతున్నాయన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణంపై హైకోర్టు మాజీ న్యాయమూర్తితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. గోదావరిలో పేరుకుపోయిన పూడికను దశాబ్దాల నుంచి తొలగించలేదని, దీంతో ఇరు ప్రాంతాలు వర్షాకాలంలో ముంపునకు గురవుతున్నాయన్నారు. పూడికను తొలిగించేందుకు అనుమతివ్వాలన్నారు. ముంపు ప్రాంత గ్రామాలు, రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు.

‘రెచ్చగొట్టేలా వ్యవహరించిన వ్యక్తిపై చర్యలు తీసుకోండి’

భైంసాటౌన్: తమ వర్గం మనోభావాలు రెచ్చగొట్టేలా వ్యవహరించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పట్టణంలోని పంజేషా మసీద్ నిర్వహణ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు ఆదివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ జి.గోపీనాథ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓ యువకుడు తమ వర్గం మనోభావాలు దెబ్బతినేలా సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేశాడని, ఈ మేరకు అతనిపై చర్యలు తీసుకోవాలన్నారు.

బస్టాండ్‌కు దారేది?



బాసర: బాసర బస్టాండ్‌లో సరైన వసతులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బస్టాండ్ వెనుక భాగంలో ముళ్ల పొదలు ఉండడంతో కాలినడకన వెళ్లే ప్రయాణికులకు దారి కనిపించని పరిస్థితి. బస్టాండ్ ప్రాంగణంలో పిచ్చిమొక్కలు తొలగించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్డుప్రమాదంలో మహిళకు గాయాలు

నర్సాపూర్(జి): రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలయ్యాయి. వివరాలు ఇలా.. దిలావర్‌పూర్ మండలం లోలం గ్రామానికి చెందిన దూసముడి మహేశ్, లక్ష్మి పని నిమిత్తం ఆదివారం ఎక్సెల్ మోపెడ్‌పై పిప్రి గ్రామానికి బయల్దేరారు. మార్గమధ్యలో రాంపూర్ బస్టాండ్ చేరుకోగా, నిర్మల్ నుంచి భైంసా వైపు వెళ్తున్న నర్సాపూర్ (జి) గ్రామానికి చెందిన బర్కుంట గంగయ్య బైక్ అతి వేగంగా నడుపుతూ టీవీఎస్ ఎక్సెల్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో లక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మహేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై శంకర్ తెలిపారు.

ఆలయాల్లో పూజలు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. గంగనీళ్ల జాతర మొదటి ఆదివారం కావడంతో భక్తుల రద్దీ నెలకొంది. పల్లకి సేవలో పాల్గొన్నారు. అమ్మవారికి నైవేద్యంగా బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

పోచమ్మ వద్ద సందడి

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారం పోచమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు సందడి చేశారు. సుదూర ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు.

రాణి దుర్గావతి జయంతి

కడెం: మొఘల్ పరిపాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి మడావి దుర్గావతి అని రాజ్‌గోండ్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఆత్రం రాజేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలో రాణి దుర్గావతి జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉర్వేత ఆనంద్‌రావు, చిత్రుపటేల్, జగదీశ్వర్, సక్కు ఉన్నారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

లోకేశ్వరం: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై అశోక్ అన్నారు. మండలంలోని రాయపూర్‌కాండ్లీ గ్రామంలో ఆదివారం ఎన్నికల నిబంధనలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో అల్లర్లకు పాల్పడవద్దని పేర్కొన్నారు. పిల్లలు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలన్నారు. పోలీసు సిబ్బంది ఉన్నారు.